
సాక్షి ఒడిశా

శనివారం । 30 । డిసెంబర్ । 2023



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం శుక్రవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.5,53,478 వచ్చాయని అధికారులు తెలిపారు.



సందడిగా చొయితి ఉత్సవాలు

రాయగడ గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో చొయితి వేడుకలు సందడిగా కొనసాగుతున్నాయి.

- 8లో



గంజాయి సాగుపై ఉక్కుపాదం

రాష్ట్రంలో గంజాయి సాగుపై ఎక్సైజ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు.

- 8లో

న్యూస్‌రీల్

19 మంది అధికారులకు పదోన్నతి

భువనేశ్వర్: రాష్ట్ర క్యాడర్‌కు చెందిన 19 మంది ఐపీఎస్ అధికారులకు ప్రభుత్వం పదోన్నతి కల్పించింది. శుక్రవారం సాధారణ పాలన–ప్రజా ఫిర్యాదుల విభాగం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం 5 మంది ఐపీఎస్ అధికారులు ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఐజీ) స్థాయికి, మరో ఆరుగురికి డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ (డీఐజీ) ఆఫ్ పోలీస్ స్థాయికి పదోన్నతి కల్పించారు. అంతేకాకుండా సీనియర్ ఐపీఎస్ అధికారికి అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీ) స్థాయి పదోన్నతి లభించింది. 2006 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారులైన అనూప్ కుమార్ సాహూ, అమృతా దాష్, అనిరుద్ కుమార్ సింగ్, అనూప్ కృష్ణ, సుధా సింగ్‌లు ఐజీ పోలీసు స్థాయికి పదోన్నతి పొందారు. 1999 బ్యాచ్‌కు చెందిన ఘనశ్యామ్ ఉపాధ్యాయ్ సెంట్రల్ డిప్యూటేషన్‌పై ఏడీజీ పోలీసుగా పదోన్నతి పొందారు. 2010 బ్యాచ్‌కు చెందిన మిత్రభాను మహాపాత్రో, షారా శర్మ, కన్వర్ విశాల్ సింగ్‌లు డీఐజీ పోలీసు గ్రేడ్‌కి పదోన్నతి పొందారు. అదేవిధంగా ఆశిష్ కుమార్ సింగ్, పరుల్ గుప్తా, కె.శివ సుబ్రమణి ఇప్పుడు డీఐజీ పోలీసు హోదాను కలిగి ఉంటారు. ఐపీఎస్ అధికారులు పినాక్ మిశ్రా, బానోత్ జుగల్ కిషోర్ కుమార్, బత్తుల గంగాధర్, రాహుల్ జైన్, శార్వణ్ వివేక్, కుసల్కర్ నితిన్ దగ్దు, ప్రత్యూష్ దివాకర్‌లకు కూడా పదోన్నతి లభించింది.

కొండచిలువ కలకలం



పట్టుబడిన కొండచిలువ

బరంపురం: నగరంలోని గజపతి నగర్‌లో 10 అడుగుల కొండచిలువ శుక్రవారం కలకలం సృష్టించింది. స్థానికుల సమాచారంతో బరంపురం అటవీ శాఖ అధికారుల సహకారంతో స్నేక్ హెల్ప్‌లైన్ సంస్థకి చెందిన ఆశిరాజ్ చాకచక్యంగా 10 అడుగుల కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దిగపండి అటవీ విభాగం దగ్గరలో ఉన్నటువంటి చందుడిదేవ్ అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు. దీంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.


ఏడుగురు నిందితులు అరెస్టు



అరెస్టైన నిందితులను చూపిస్తున్న పోలీసులు

బరంపురం: నగర శివారులోని బిక్రమ్‌చంద్రపూర్‌లో ఒక ఇంటిపై ఈనెల 26వ తేదీ ఉదయం జరిగిన బాంబుల దాడికి సంబంధించి ఏడుగురు నిందితులను పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. బరంపురం ఎస్పీ సార్వణ్ వివేక్ తెలిపిన వివరాల మేరకు.. నిమ్మాఖండి పోలీసు స్టేషన్ పరిధి బిక్రమ్ చంద్రపూర్‌లో పాత కక్షలతో బబుల సాహు ఇంటిపై బాంబు దాడి జరిగింది. ఈ ఘటనలో బబుల సాహు తీవ్రగాయలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. దీనిపై కేసు నమోదు చేసిన పోలీసులు ఏడుగురు నిందితులను అరెస్టు చేసి, వారి దగ్గర నుంచి రెండు ఇనుప కత్తులు, లైవ్ బాంబులను సీజ్ చేశారు. అరెస్టైనవారిలో సురేష్ సాహు, కిరణ్ కుమార్, రాధామాదవ్ సాహు, బైష్ణవి సాహు, అజిత్ కుమార్ సాహు, బి.వాసురెడ్డి, బిద్య దాస్‌లు ఉన్నట్లు వెల్లడించారు.

రాష్ట్రంలో మరో 5 కరోనా కేసులు



భువనేశ్వర్: ఒడిశాలో గత 24 గంటల్లో మరో 5 మందిలో కోవిడ్ – 19 పాజిటివ్ ఖరారైంది. దీంతో రాష్ట్రంలో క్రియాశీల కరోనా వైరస్ కేసుల సంఖ్య 13కి పెరిగింది. వీరంతా తేలికపాటి లక్షణాలతో, హోం ఐసోలేషన్‌లో ఉన్నట్లు అధికారులు తెలియజేశారు. ప్రస్తుతం వారి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని పేర్కొన్నారు. కోవిడ్ జేఎన్–1 వేరియంట్ విస్తరణ దృష్ట్యా వృద్ధులు, అనారోగ్య సమస్యలు ఉన్నవారు బయటకు వెళ్లేటప్పుడు మాస్క్ ఉపయోగించాలని ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తెలిపింది. రద్దీగా ఉండే ప్రదేశాలను సందర్శించకుండా ఉండాలని సూచించింది.

పసుపు రైతుకు పెద్దపీట



పసుపు కొమ్ములు ఆరబెడుతున్న గిరిజన మహిళలు

- దళారుల బారిన పడకుండా చర్యలు
- నేరుగా కొనుగోలు చేస్తున్న ప్రభుత్వం
- ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ చేసుకున్న 4వేల మంది

బరంపురం: కొందమాల్ జిల్లాలో ఈ ఏడాది పసుపు పంట దిగుబడి గణనీయంగా పెరిగింది. ఈ నేపథ్యంలో పసుపు రైతులు దళారుల బారిన పడకుండా జిల్లా పాలన యంత్రాంగం చర్యలు చేపట్టింది. గిరిజన రైతులకు మద్దతు ధర కల్పిస్తూ ప్రభుత్వమే నేరుగా పసుపు కొనుగోలు చేస్తుంది. దీంతో ప్రతిఏటా గిరిజనుల కష్టాన్ని దోచుకునే మధ్యవర్తుల అగడాలకు అడ్డుకట్టవేసింది. పసుపు పంటను కొందమాల్ ఎపెక్స్ స్పెషల్ అసోసియేషన్ మార్కెటింగ్ (కసమా) ద్వారా కనీస మద్దతు ధరతో కొనుగోలు ప్రక్రియ చేపట్టింది.

80 శాతం ఉత్పత్తి ఇక్కడే

ప్రకృతికి నిలయంగా పేరు గాంచిన కొందమాల్ జిల్లాలో పసుపు సాగుకు రాష్ట్రంలో ప్రత్యేక స్థానం ఉంది. రాష్ట్రంలోని మొత్తం పసుపు సాగులో 80 శాతం ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతుంది. ఇక్కడ నూటికి 99 శాతం మంది గిరిజనులు పసుపు సాగే ఆధారంగా జీవిస్తున్నారు. ఇక్కడ 13 వేల హెక్టార్లలో 30 వేల మెట్రిక్ టన్నుల పసుపు కొమ్ముల ఉత్పత్తి జరుగుతోంది. ఇందులో 2 వేల మెట్రిక్ టన్నుల పసుపు కొమ్ములు ఇతర దేశాలకు ఎగుమతి అవుతున్నాయి. అయితే గిరిజనులు దళారుల బారినపడి మోసపోతున్నారు. దీంతో ఈ ఏడాది నుంచి ప్రభుత్వమే నేరుగా కొనుగోలు చేస్తోంది.

కసమ్ ద్వారా కొనుగోలు

దళారుల బారినపడి గిరిజన రైతులు మోసపోతున్నట్లు గ్రహించిన రాష్ట్ర ప్రభుత్వం కొందమాల్ జిల్లా పాలన యంత్రాంగాన్ని అప్రమత్తం చేసింది. కలెక్టర్ డి.బందా ఆధ్వర్యంలో కసమ్ ద్వారా దరింగబడి, రైకియా రెండు బ్లాకుల్లో రైతుల నుంచి పసుపు కొమ్ముల కొనుగోలు చేశారు. ఈ నేపథ్యంలో ఇప్పటివరకు 15 రోజుల్లో 4,000 మంది గిరిజన రైతుల పేర్లను అధికారికంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగింది. ఈనెల చివరి నాటికి మరో 6 వేల మంది రిజిస్ట్రేషన్ చేసుకుంటారని అంచనా వేస్తున్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి ప్రభుత్వమే నేరుగా పసుపు కొనుగోలు చేస్తుందని కలెక్టర్ తెలియజేశారు.



దరింగబడిలో పసుపు సాగు



మెట్రో ప్రాజెక్టు విస్తరణ..?

- జంట నగరాల మెట్రో ప్రాజెక్టు నవరణ యోచన
- త్రిశూలియా కొత్త వంతెన టెండర్ రద్దు

భువనేశ్వర్: కటక్ నగరంలో త్రిశూలియా, జ్యుడిషియల్ అకాడమీని కలుపుతూ కొత్త వంతెన నిర్మాణ ప్రణాళిక మార్పుబడింది. ఈ నేపథ్యంలో రూ.220 కోట్ల టెండర్ రద్దు చేశారు. మరోసారి టెండర్లు ఆహ్వానించాలని నిర్ణయించారు. పాత వంతెన నిర్మాణ ప్రణాళిక రద్దు చేసి దాదాపు రూ.700 కోట్ల వ్యయ ప్రణాళికతో బహుళ రవాణా వ్యవస్థతో వంతెన నిర్మించాలని యోచిస్తున్నారు.

లోగడ జంట నగరాల మెట్రో రైలు ప్రాజెక్ట్ త్రిశూలియా వరకు ఉంటుందని ప్రకటించారు. ఈ యోచనలో స్వల్ప మార్పులు చేపట్టి కటక్ నగరం లోపలికి తీసుకురావాలని యోచిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మెట్రో ప్రాజెక్టును విస్తరించాలనే యోచనతో త్రిశూలియా రెండో వంతెన నిర్మాణం టెండర్‌ను రద్దు చేసినట్లు విభాగం ఇంజినీర్ ఒకరు తెలియజేశారు.

బస్ టెర్మినల్ వరకు విస్తరణ

తొలిదశలో భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి త్రిశూలియా కూడలి వరకు మెట్రో రైలు ప్రాజెక్టును ప్రతిపాదించారు. అయితే ఇప్పుడు దానిని కటక్ నేతాజీ బస్ టెర్మినల్ వరకు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితుల్లో కఠజోడి వంతెన నిర్మాణాన్ని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. 6 అంచెల రహదారితో నిర్మితం కానున్న వంతెనపై మెట్రో రైళ్ల పరుగులు తీసేందుకు వీలుగా నిర్మాణ ప్రణాళిక స్వీకరించినట్లు సమాచారం. కిందన బస్సులు, ఇతర వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. ఈ వంతెనకు సంబంధించి సవివర ప్రణాళిక నివేదిక (డీపీఆర్) సిద్ధమవుతోంది. నివేదిక వచ్చిన తర్వాత ప్రభుత్వం టెండర్లు ఆహ్వానిస్తుంది.

కొత్త రూట్

జంట నగరాల మెట్రో రైలు ప్రాజెక్ట్ ప్రతిపాదిత రూటు మారుతుంది. తాజా యోచన మేరకు నేతాజీ బస్ టెర్మినల్‌ను జ్యుడిషియల్ అకాడమీ, శిశు భవన్, హైకోర్టు, పూరీ ఘాట్ మీదుగా కలుపుతుంది. కఠజోడి నదిపై ఉన్న నేతాజీ సేతు పక్కనే మరో 20 మీటర్ల వెడల్పుతో వంతెన నిర్మించాలని యోచిస్తున్నారు. దీని కోసం ఓటీసీసీ టెండర్ ఆహ్వానించింది. ఈ నేపథ్యంలో భువనేశ్వర్ విమానాశ్రయం నుంచి సీఎస్‌బీటీ వరకు మెట్రో ప్రాజెక్టును పొడిగిస్తే మరింత స్వాగతించవచ్చు. ఇందుకు సంబంధించి 2024 జనవరిలో శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూత్రాభిప్రాయంగా నిర్ణయించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న కలెక్టర్ స్మృతి రంజన్ ప్రధాన్ తదితరులు

పర్లాకిమిడి: స్థానిక ఆర్ఎంసీఎస్ మార్కెట్ ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్, జిల్లా ప్రోక్యూర్‌మెంట్ చైర్మన్ స్మృతిరంజన్ ప్రధాన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు 2023–24 సంవత్సరంలో జిల్లాలో ధాన్యం కొనుగోళ్ల కోసం 64 మండీలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాటిలో ప్రభుత్వ మద్దతు ధరకు ధాన్యం కొనుగోలు చేసేందుకు 45 వ్యవసాయ పరపతి సంఘాలు, 19 మహిళా స్వయం సహాయక గ్రూపులు, రెండు ప్యాక్స్ (గుమ్మా, రాయఘడ) సొసైటీలకు అనుమతి ఇచ్చినట్లు వెల్లడించారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం 5,29,000 క్వింటాళ్లుగా ప్రకటించారు. ధాన్యం అమ్మకానికి ఇప్పటివరకు 15,551 మంది రిజిస్ట్రేషన్లు చేసుకున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రఫుల్ల కుమార్ బెహెరా తెలియజేశారు. ధాన్యం మండీల వద్ద అమ్మకం జరిగిన తర్వాత రైతు బ్యాంకు ఖతాలో డబ్బులు జమ అవుతాయని పౌరసరఫరాల శాఖ అధికారి బెహరా తెలియజేశారు. గ్రేడ్–ఏ ధాన్యం మద్దతు ధర రూ.2,203 లుగా నిర్ణయించారు. కార్యక్రమంలో జిల్లా కృషక్ సంఘ అధ్యక్షుడు సూర్యనారాయణ పట్నాయక్, జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ప్రఫుల్ల కుమార్ బెహరా, అసిస్టెంట్ కో–ఆపరేటివ్ రిజిస్ట్రార్ హరిహర శెఠి, ప్రాంతీయ మార్కెట్ కో–ఆపరేటివ్ సొసైటీ కార్యదర్శి రేవతీ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

మూడో విడత బీఎస్‌కేవై ప్రారంభం

భువనేశ్వర్: రాష్ట్ర ప్రభుత్వం ఫ్లాగ్‌షిప్ ఆరోగ్య పథకం బిజూ స్వాస్థ్య కల్యాణ్ యోజన (బీఎస్‌కేవై) మూడో దశను శుక్రవారం ప్రారంభించింది. లోగడ ఈ పథకం నుంచి మినహాయించబడిన గ్రామీణ కుటుంబాలు లబ్ధి పొందుతాయి. ఈ సందర్భంగా ప్రభుత్వం కొత్త 'బీఎస్‌కేవై నవీన్ కార్డ్'ని ప్రారంభిస్తున్నట్లు ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ ప్రకటించారు. రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని కుటుంబాలకు ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్లిష్టమైన వ్యాధుల కోసం నగదు రహిత సంరక్షణ హామీ ఇవ్వబడుతుందన్నారు. ఈ విస్తరణ దశలో రాష్ట్రంలో అన్ని గ్రామీణ కుటుంబాలు (సాధారణ ప్రభుత్వ ఉద్యోగులు, ఆదాయపు పన్ను చెల్లింపుదారులు మినహా), ప్రస్తుతం బీఎస్‌కేవై పరిధిలోకి రాని వారు బీఎస్‌కేవై నవీన్ కార్డ్ పొందేందుకు అర్హులుగా పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రం లోపల, వెలుపల ఉన్న ఎంపానెల్ ప్రైవేట్ ఆస్పత్రులలో గుర్తించబడిన అనారోగ్యాల కోసం సంవత్సరానికి రూ.5 లక్షల నగదు రహిత సంరక్షణ (మహిళా సభ్యులకు రూ.10 లక్షల వరకు) పొందవచ్చని ముఖ్యమంత్రి తెలిపారు.

90 శాతం కుటుంబాలకు మేలు

ఈ మూడో దశ విస్తరణతో రాష్ట్రంలోని దాదాపు 90 శాతం కుటుంబాలకు బీఎస్‌కేవై కింద ఆరోగ్య బీమా అందించబడుతుందని నవీన్ పట్నాయక్ తెలిపారు. తద్వారా ఒడిశా ప్రజలకు సార్వత్రిక ఆరోగ్య కవరేజీ హామీని నెరవేర్చడం జరుగుతుందన్నారు. బీఎస్‌కేవై కవరేజీని దశల వారీగా విస్తరిస్తున్నామని, మొత్తం జనాభాకు సమగ్ర ఆరోగ్య రక్షణను అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. గత ఐదేళ్లలో కేవలం ప్రైవేట్ ఆస్పత్రుల్లో బీఎస్‌కేవైలో దాదాపు 21 లక్షల మంది రోగులకు సుమారు రూ.4,500 కోట్ల నగదు రహిత ఆరోగ్య సంరక్షణను అందించినట్లు వెల్లడించారు. ఇది సార్వత్రిక ఆరోగ్య కవరేజీకి ఒక ప్రత్యేక నమూనాగా మారిందన్నారు.

చిద్విలాసం

కొరాపుట్: జిల్లాలోని దశమంతపూర్ సమితి కేంద్రంలో ఉన్నటువంటి సంరక్షణ కేంద్రంలో శుక్రవారం ఉద్విగ్న వాతావరణం నెలకొంది. 2015వ సంవత్సరంలో తాము సంరక్షించిన చిన్నారి తమ ముందుకు వచ్చి ముద్దుగా మాట్లాడుతుండడంతో అక్కడివారు మురిసిపోయారు. ఆ చిన్నారి తన తోటి సహచరులకు అనేక ఆట వస్తువులు, పుస్తకాలు, మిఠాయిలు తీసుకొని వచ్చి పంచిపెట్టడంతో సందడి వాతావరణం నెలకొంది. వివరాల్లోకి వెళ్తే.. 2015 సంవత్సరంలో మల్కన్‌గిరి జిల్లా అటవీ ప్రాంతంలో అర్ధరాత్రి ఒక పసికందు రోదనలు స్థానిక గిరిజనులకు వినిపించాయి. దీంతో అక్కడకి చేరుకున్నవారికి 15 నెలల ఒక ఆడ పసికందు కనిపించింది. వారు చిన్నారిని సంరక్షించి అధికారులకు సమాచారం ఇచ్చారు.

పసికందు వివరాలు కోసం ఆరా తీయగా, ఒక బాలిక జన్మనిచ్చి సమాజానికి భయపడి వదిలి వెళ్లినట్లు తెలిసింది. దీంతో అధికారులు ఆ పసికందుకి అన్నపూర్ణగా నామకరణం చేసి దశమంత్‌పూర్ సమితి కేంద్రంలో ఉన్నటువంటి సంరక్షణ కేంద్రానికి తరలించారు. ఇదే సమయంలో అమెరికాలోని చికాగోలో స్థిరపడిన ప్రవాస భారతీయ శ్రీమంతుడు కశ్యప్ ముత్తు రామన్ దంపతులు దత్తత కోసం ప్రయత్నాలు చేశారు. 2016 డిసెంబర్‌లో భారత ప్రభుత్వ అనుమతితో ముత్తు రామన్ దంపతులు అన్నపూర్ణని చట్ట ప్రకారం దత్తత తీసుకున్నారు. అనంతరం అన్నపూర్ణ పేరును కావ్యగా మార్చుకొని ఎంతో ప్రేమగా పెంచుకుంటున్నారు. అక్కడ కావ్య ఆంగ్లంతో పాటు తల్లి భాష తమిళం మీద కూడ పట్టు సాధించింది. ప్రస్తుతం చికాగోలో రెండో తరగతి చదువుతోంది. అయితే సుమారు ఏడేళ్ల తర్వాత ముత్తు రామన్ కుటుంబం ఇండియా పర్యటనకి వచ్చింది. దీనిలో భాగంగా తాము దశమంత్‌పూర్ సంరక్షణ కేంద్రానికి కావ్యను తీసుకొచ్చారు. దీంతో అక్కడివారు కావ్యను చూసి ఆనందం వ్యక్తం చేశారు. కావ్య తమ కుటుంబంలోకి రావడం అదృష్టంగా భావిస్తున్నామని ముత్తురామన్ కుటుంబ సభ్యులు తెలియజేశారు.



దశమంత్‌పూర్ సంరక్షణ కేంద్రం వద్ద కావ్యతో కుటుంబ సభ్యులు

అంధకారంలో స్వాభిమాన్ ఏరియా



దీపం వెలుగులో చదువుతున్న చిన్నారులు

మల్కన్‌గిరి: జిల్లాలోని చిత్రకొండ సమితి స్వాభిమాన్ ఏరియా పెప్పరమెట్ల పంచాయతీ రూమ గ్రామంలో గత మూడు నెలలుగా అంధకారం అలముకుంది. గిరిజన ప్రాబల్యం ఉన్నటువంటి ఈ ప్రాంతంలో టాటా పవర్ వారు ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ కొద్దిరోజుల క్రితం పాడైపోయింది. దీంతో ఫిర్యాదు చేయగా కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయకుండానే ఉన్నదానిని రిపేర్ చేశారు. అయితే మరలా ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో అప్పటినుంచి గ్రామానికి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీనిపై గ్రామస్తులు ఎన్నిసార్లు విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ గ్రామంలో 35 కుటుంబాలు నివసిస్తున్నాయి. దీంతో చీకటిలో వన్యప్రాణులు దాడులు చేస్తాయని భయంతో గడుపుతున్నారు. కాగా అంధకారంలో ఉంటున్నప్పటికీ కరెంటు బిల్లులు కట్టాలని చెబుతుండడం గమనార్హం. దీనిపై గిరిజనులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సమస్యను తక్షణమే పరిష్కరించకుంటే జాతీయ రాహదారిపై ధర్నా చేస్తామని హెచ్చరిస్తున్నారు. దీనిపై కలెక్టర్ విశాల్‌సింగ్‌కు ఫిర్యాదు చేయగా, 15 రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



గ్రామంలో ఉన్నటువంటి కరెంట్ స్తంభం



బిల్లు చూపిస్తున్న రూమాగూడ గ్రామస్తుడు

క్లుప్తంగా

జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ షడంగి

భువనేశ్వర్: జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ఒడిశా హైకోర్టుకు చెందిన డాక్టర్ జస్టిస్ బి.ఆర్.షడంగిని నియమించాలని సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేసింది. జస్టిస్ బి.ఆర్.షడంగి హైకోర్టు, సుప్రీంకోర్టు బార్‌లో నిరవధికంగా 27 సంవత్సరాల ప్రాక్టీస్ పూర్తిచేసిన తర్వాత, 2013 జూన్‌లో ఒడిశా హైకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. జస్టిస్ సంజయ కుమార్ మిశ్రా పదవీ విరమణతో జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో ఖాళీ ఏర్పడుతుందని భారత ప్రధాన న్యాయమూర్తి డి.వై.చంద్రచూడ్ నేతృత్వంలో సుప్రీంకోర్టు కొలీజియం పేర్కొంది. దీంతో జార్ఖండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా నియామకం కోసం ఒడిశా హైకోర్టు నుంచి సీనియర్ జడ్జి అయిన డాక్టర్ జస్టిస్ బి.ఆర్.షడంగి పేరును కొలీజియం సిఫార్సు చేసిందని పేర్కొంది. 10 ఏళ్లకు పైగా హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేసిన సమయంలో 1,056 కంటే ఎక్కువ తీర్పులను వెల్లడించారని పేర్కొంది. అతను హైకోర్టులో న్యాయాన్ని అందించడంలో గణనీయమైన అనుభవం దృష్ట్యా సిఫార్సు చేయడం విశేషం.

నాటుసారా స్థావరాలపై దాడులు


స్వాధీనం చేసుకున్న సామగ్రితో సిబ్బంది

జయపురం: సమితిలోని గొడాపాదర్ సమీప అడవిలో జయపురం ఎక్సైజ్ సిబ్బంది శుక్రవారం దాడులు నిర్వహించారు. దీనిలో భాగంగా రెండు సారాబట్టీల్లో 120 లీటర్ల నాటుసారాతో పాటు, 800 లీటర్ల ఇప్ప ఊటను పట్టుకున్నట్లు జయపురం ఎక్సైజ్ అధికారి నీలాద్రి బిహారి మిశ్ర శుక్రవారం వెల్లడించారు. పట్టుబడిన నాటుసారా, ఊట విలువ రూ.50 వేలు ఉంటుందని వెల్లడించారు. సారా తయారు చేసేందుకు వినియోగించే సామగ్రిని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.

శ్రీజగన్నాథ ఆలయంలో బాలికకు గాయాలు

భువనేశ్వర్: పూరీ శ్రీజగన్నాథ ఆలయంలో శుక్రవారం రెండు దురదృష్టకర సంఘటనలు చోటు చేసుకున్నాయి. ఆలయంలో వెలుగుతున్న దీపం దుస్తులకు అంటుకోవడంతో మైనర్ బాలికకు గాయాలయ్యాయి. ప్రస్తుతం బాలిక పరిస్థితి విషమంగా ఉండడంతో పూరీ జిల్లా ప్రధాన కార్యాలయం ఆస్పత్రిలో చేర్చారు. ఆమె స్వస్థలం హైదరాబాద్. అలాగే శ్రీజగన్నాథ దేవాలయంలోని సింహద్వారం ముందు వీధి కుక్క కాటు వేయడంతో 2 ఏళ్ల చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. అరుణ స్తంభానికి సమీపంలో నిద్రిస్తున్న వీధి కుక్క అకస్మాత్తుగా తన తల్లిదండ్రులతో కలిసి సమీపంలో ఆడుకుంటున్న చిన్నారిపై దాడి చేసింది. చిన్నారిని ఆలయ సమీపంలోని ప్రథమ చికిత్స కేంద్రానికి తరలించారు.

మంత్రి అశోక్ పండా పర్యటన


స్టేషన్‌లో మంత్రికి స్వాగతం పలుకుతున్న నాయకులు

కొరాపుట్: రాష్ట్ర సాంస్కృతిక శాఖ మంత్రి అశోక్ పండా కొరాపుట్ జిల్లాలో పర్యటించారు. శుక్రవారం రైలులో కొరాపుట్ రైల్వేస్టేషన్‌కి చేరుకున్నారు. మంత్రికి రైల్వేస్టేషన్‌లో కొరాపుట్ జిల్లా ఎమ్మెల్యే, జిల్లా ప్రణాళికా సంఘం చైర్మన్ రఘురాం పాడాల్, కొరాపుట్ పురపాలక సంఘ అధ్యక్షుడు లలెటెందు రంజన్ శెఠిలు స్వాగతం పలికారు. అనంతరం కొరాపుట్ స్పెషల్ సర్క్యూట్ హౌస్‌లో మంత్రితో అధికార బీజూ జనతా దళ్ నాయకులు, అధికారులు వేర్వేరుగా చర్చలు జరిపారు. అనంతరం మంత్రి గుప్తేశ్వరం దర్శనానికి వెళ్లారని అధికార వర్గాలు ప్రకటించాయి.

శ్రీముఖలింగేశ్వరుని ఆదాయం రూ.4.40 లక్షలు

జలుమూరు: ప్రసిద్ధ శైవక్షేత్రం శ్రీముఖలింగంలో గడిచిన 56 రోజులకు గానూ హుండీ ఆదాయం రూ.4,40,306 వచ్చినట్లు ఈఓ పి.ప్రభాకరరావు శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో అర్చకులు, భక్తులు సత్యసాయిసేవాసమితి సమక్షంలో హుండీని తెరిచి లెక్కించారు.

'కుష్టు నివారణకు కృషి'

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కుష్టు వ్యాధి నివారణే ధ్యేయంగా పనిచేయాలని జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆయన శుక్రవారం వైద్యాధికారులతో సమావేశమయ్యారు. డిసెంబరు 27 నుంచి జనవరి 12 వరకు కుష్టువ్యాధిగ్రస్తులను గుర్తించే కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. రెండు వారాల పాటు ఇంటింటా సర్వే నిర్వహించి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని, దీనికోసమే కలెక్టర్ ఆదేశాలపై 2,224 టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఈ టీంలో ఒక ఆశ, ఒక మేల్ వలంటీర్ ఒక టీమ్ గా సందర్శించే విధంగా చర్యలు తీసుకోవాల ని ఆదేశించారు. గ్రామంలో రోజుకి 20 చొప్పు న, పట్టణ పరిధిలో 50 చొప్పున ఇంటింటా సర్వే చేసి స్పర్శ లేని తెల్లని మచ్చలను గుర్తించి సంబంధిత వైద్యాధికారికి చూపించి వ్యాధి ని ర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్స (ఎండీటీ) ద్వారా నివారణ చర్యలు చేపట్టాలన్నారు.


భక్తి గీతాలు ఆలపిస్తున్న కళాకారులు


రాయగడ కళాకారులచే నృత్య ప్రదర్శన


ఆదివాసీల జానపద నృత్యం

సందడిగా చౌయితి ఉత్సవాలు


వేదికపై బృహత్తర పరిశ్రమల యూనిట్ హెడ్‌లు


కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు


మజార్ బేగ్ తదితరులు

స్థానిక గోవింద చంద్రదేవ్ ఉన్నత పాఠశాల మైదానంలో చౌయితి వేడుకలు సందడిగా కొనసాగుతున్నాయి. నాలుగో రోజు శుక్రవారం ఉత్సవాలకు ముఖ్య అతిథిగా జిల్లాలోని కాసీపూర్ సమితి టికిరిలో ఉత్కళ అలూమిన కర్మాగారం యూనిట్ హెడ్ మజార్ బేగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా మల్కన్‌గిరి మార్షల్ ఆర్ట్స్ బృందం విన్యాసాలు అలరించాయి. అదేవిధంగా ఆదివాసీ, హరిజన సాంప్రదాయ నృత్యాలు ప్రత్యేకంగా నిలిచాయి. ఈనెల 26వ తేదీ నుంచి జరుగుతున్న ఉత్సవాలు శనివారంతో ముగుస్తాయి. కార్యక్రమంలో కలెక్టర్ స్వాదాదేవ్ సింగ్, ఏడీఎం భాస్కరరైతా, డీఆర్‌డీఏ పీడీ నిహారి రంజన్ కుహరో తదితరులు పాల్గొన్నారు. – రాయగడ


మణిపూరి డ్యాన్స్


మల్కన్‌గిరి మార్షల్ అర్ట్స్ బృందం విన్యాసాలు


మహిళల నృత్య ప్రదర్శన


విదేశీయుల సందడి

● ఆహ్వానాలు


జగన్నాథ ఆలయానికి ఆహ్వానం అందజేస్తున్న దృశ్యం


కలెక్టర్ విశాల్‌సింగ్‌కు ఆహ్వానం అందజేస్తున్న బృందం


గిరిజన నృత్యాలతో స్వాగతం పలుకుతున్న దృశ్యం

పూరీ జగన్నాథ ఆలయ శ్రీమందిరం ప్రాకార ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి దేశవ్యాప్తంగా ఆహ్వానాలు అందజేస్తున్న విషయం తెలిసిందే. దీనిలో భాగంగా మల్కన్‌గిరి జిల్లా కలెక్టర్ విశాల్ సింగ్, స్థానిక జగన్నాథ ఆలయ కమిటీకి శుక్రవారం శ్రీమందిరం ఆలయ బృందం సభ్యులు ఆహ్వానాలు అందజేశారు. ఈ సందర్భంగా చేపట్టిన సాంస్కృతిక నృత్యాలు ఆకట్టుకున్నాయి. – మల్కన్‌గిరి

కేంద్ర పథకాల అమలుపై సంతృప్తి

కొత్తూరు: కేంద్రం అందజేస్తున్న పథకాలను ఇక్కడ చక్కగా అమలుచేస్తున్నా రని జాతీయ వైద్య సేవలు, నాణ్యత ప్రమాణాల పరిశీలన కమిటీ సభ్యులు సంతృప్తి వ్యక్తం చేశారు. కమిటీ సభ్యులు రేఖ, డాక్టర్ రాధిక లాల్‌మణిలు శుక్రవారం కొత్తూరు మండలం మాకవరం, వసప వెల్‌నెస్ సెంటర్లను శుక్రవారం పరిశీలించి రికార్డులను చూశారు. ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన పథకం, ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రసవాలు, పీఎం వైద్యారోగ్య కార్డులతో పాటు పలు రకాల పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో చూశారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లతో మాట్లాడారు. కార్యక్రమంలో కురిగాం పీహెచ్‌సీ వైద్యాధికారి సందీప్ కుమార్, ఈఓ బుజ్జిబాబు, సూపర్‌వైజర్ తిరుపతిరావు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్‌ఎంలు పాల్గొన్నారు.





ఇంతి పంట

- చిరుధాన్యాలు, ఆకు కూరలు సాగు చేస్తున్న మహిళా రైతులు
- జిల్లా వ్యాప్తంగా 36,891 మంది మహిళా రైతులతో 27,180 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయ
- పండించిన పంటలను ఐకేపీ ద్వారా విక్రయాలు
- స్వయం సహాయక సంఘాల సభ్యులకే ఆదాయం

టెక్కలి: మహిళలు పొలాల్లోకి దిగుతున్నారు. రైతే రాజు నానుడిని రైతే రాణిగా మార్చేలా ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంట పండించి చూపిస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహాలను అందిపుచ్చుకుని స్వయం సహాయక సంఘాల సభ్యులు సాగు యాగాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నారు. ప్రభుత్వం కూడా స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఎలాంటి రసాయనాలు లేకుండా ప్రకృతి వ్యవసాయం ద్వారా చిరుధాన్యాలు, కూరగాయలు పండించేలా ప్రోత్సహిస్తోంది. వ్యవసాయ శాఖ ద్వారా


ప్రకృతి వ్యవసాయం ద్వారా పండించిన పంటలను విక్రయిస్తున్న స్వయం సహాయ సంఘాల్లో మహిళా రైతులు, సిబ్బంది


రైతు సాధికార సంస్థ స్వయం సహాయక సంఘాల సభ్యులతో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం చేయిస్తున్నారు.

ఈ వ్యవసాయం ద్వారా పండిన పంటలను ఐకేపీ ఆధ్వర్యంలో నియోజకవర్గ కేంద్రాల్లో విక్రయించి తద్వారా వచ్చిన ఆదాయాన్ని ఆయా మహిళా రైతులకే అందజేసే విధంగా కమ్యూనిటీ మేనేజ్డ్ నేచురల్ ఫార్మింగ్ కార్యక్రమాన్ని దిగ్విజయంగా కొనసాగిస్తున్నారు.

27,180 ఎకరాల్లో..


- జిల్లాలో ఎంపిక చేసిన స్వయం సహాయక సంఘాల్లోని 36,891 మంది మహిళా రైతులతో సుమారు 27,180 ఎకరాల్లో ఈ ప్రకృతి సాగు చేస్తున్నారు.
- చిరుధాన్యాలు, కూరగాయలు, కిచెన్ గార్డెన్ వంటి పంటలను ప్రోత్సహిస్తున్నారు.
- ఇదే ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆమదాలవలస మండలం నిమ్మతొర్లాడ పరిసర ప్రాంతాల్లో తయారు చేసిన బెల్లంను తిరుమల తిరుపతి దేవస్థానానికి అందజేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు.
- గత ఏడాది 15 టన్నులు ఎగుమతులు చేయగా, ఈ ఏడాది 100 టన్నులు ఎగుమతి చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.
- ఈ వ్యవసాయంపై ప్రత్యేక పర్యవేక్షణ కోసం జిల్లా వ్యాప్తంగా 316 మంది ఐసీఆర్‌పీ సిబ్బందిని నియమించారు. వీరి పర్యవేక్షణలో ప్రకృతి వ్యవసాయం చేయడంతో పాటు పండించిన పంటలను ప్రతి సోమ, మంగళ వారాల్లో నియోజకవర్గ కేంద్రాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో విక్రయిస్తారు.

ప్రత్యేకంగా శిక్షణ




రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయంపై జిల్లా వ్యాప్తంగా కొన్ని గ్రామాలతో పాటు కొంత మంది స్వయం సహాయక సంఘాల్లో మహిళా రైతులను ఎంపిక చేశాం. వీరితో పాటు ఐసీఆర్‌పీ సిబ్బంది, యూనిట్ ఇన్‌చార్జిలకు శిక్షణ అందజేశాం.
– ఎ.మాధవి, మాస్టర్ ట్రైనర్


సొంత పొలంలో..



మా గ్రామంలో సొంతంగా ఉన్న రెండు ఎకరాల పంట పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయలు పండిస్తున్నాం. ఎలాంటి రసాయనాలు లేకుండా పండించిన పంటలను విక్రయించి ఆదాయం పొందుతున్నాం. – కె.ఉషారాణి, మహిళా రైతు, లక్ష్మీపురం, సంతబొమ్మాళి మండలం



అవగాహన కల్పిస్తున్నాం



ప్రభుత్వం రైతు సాధికార సంస్థ ద్వారా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. అంతే కాకుండా స్వయం సహాయక సంఘాల్లో సభ్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి సాగు చేయిస్తున్నాం. ఈ పంటలు ఎలాంటి రసాయనాలు లేకుండా పండిస్తున్నాం.
– డి.బాలకృష్ణ, యూనిట్ ఇన్‌చార్జి, టెక్కలి మండలం

గంజాయి సాగుపై ఉక్కుపాదం

రాయగడ: జిల్లాలోని గుణుపూర్ సబ్ డివిజన్ పరిధి పుటాసింగి పంచాయతీ పిండాగుడ అటవీ ప్రాంతంలో అక్రమంగా గంజాయి సాగవుతుందన్న సమాచారం మేరకు పోలీసులు శుక్రవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ క్రమంలో సుమారు ఐదు ఎకరాల విస్తీర్ణంలోని గంజాయి మొక్కలను ధ్వంసం చేసి, అనంతరం వాటికి నిప్పుపెట్టి తగలబెట్టారు. గంజాయి అక్రమ రవాణా, గంజాయి సాగుపై ఉక్కుపాదం మోపుతామని ఎస్పీ వివేకానంద శర్మ స్పష్టం చేశారు.

బరంపురం: గంజాం జిల్లా పట్టపూర్ అటవీ ప్రాంతంలో ఎస్పీ జగమోహన్ మీనన్ ఆదేశాలతో ఎక్సైజ్ అధికారులు గంజాయి పంటలపై దాడులు నిర్వహించారు. కె.నువాగుడ గ్రామ శివారు అటవీ భూమిలో అక్రమంగా సాగు చేస్తున్న రూ.3 కోట్ల విలువచేసే గంజాయి పంటను ధ్వంసం చేశారు. అక్రమంగా సాగుచేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.


రాయగడ: గంజాయిని తగులబెడుతున్న పోలీసులు


రాయగడ: గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న సిబ్బంది


బరంపురం: గంజాయి మొక్కలను ధ్వంసం చేస్తున్న అధికారులు

నేరాలు తగ్గుముఖం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాలో నేరాలు తగ్గుముఖం పట్టాయని, గత రెండేళ్లతో పో ల్చితే 2023లో తక్కువ సంఖ్యలో నమోదయ్యా యని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. ఆమె గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో పత్రికావిలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఏడాదికి సంబంధించి వార్షిక గణాంకాలను వెల్లడించారు. 2021లో 5022 కేసులు, 2022లో 5071 కేసులు నమోదు కాగా ఈ వార్షిక సంవత్సరంలో 4618 కేసులే నమోదయ్యాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేవారిపై ఎక్కువ కేసులు నమోదయ్యాయని, శారీరక సంబంధిత నేరాలు, మహిళలపై నేరాలు, చిన్నపిల్లలపై లైంగిక నేరాలు, చోరీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, వైట్‌కాలర్ నేరాలు, మిస్సింగ్ కేసులు గణనీయంగా తగ్గాయన్నారు.

అక్రమాలపై ఉక్కుపాదం

ఎన్‌ఫోర్స్‌మెంట్ కిందట అక్రమ మద్యం, ఇసుక, గంజాయి, నాటు సారా నిర్మూలన, డ్రంక్ అండ్ డ్రైవ్‌కు సంబంధించి స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో, లాఅండ్‌ఆర్డర్ విభాగం పోలీసులు సమన్వయంతో కలిసి 6195 కేసులు నమోదు చేశామన్నారు.. గత 2021లో 1616, 2022లో 1814 మాత్రమే నమోదయ్యాయని, ఈ సంఖ్యలు పరిశీలిస్తే నిషేధిత ఉత్పత్తుల అక్రమ రవాణా మార్గాలపై ఉక్కుపాదం మోపినట్లు తెలుస్తుందన్నారు.

తీవ్ర నేరాలు తగ్గుముఖం

జిల్లాలో హత్యాయత్నం కేసులు 2021లో 31, 2022 లో 39 నమోదు కాగా.. ఈ ఏడు 25కు తగ్గాయని, కిడ్నాప్‌లు 2022లో 8 జరగ్గా ఈ యేడు ఆరుకు తగ్గాయని ఎస్పీ వివరించారు. మహిళలు, చిన్నారు లపై వేధింపుల కేసులు కూడా తక్కువగానే నమోదయ్యాయని వివరించారు. 2022లో తప్పిపోయిన కేసులు 477 నమోదు కాగా ఈ ఏడు 410కు తగ్గాయన్నారు. లోక్ అదాలత్ ద్వారా 2023లో 6715 కేసులు పరిష్కరించారని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి సంబంధించి 1,420 స్పందన అర్జీలు రాగా 1,168 పరిష్కరించామని ఎస్పీ అన్నారు.

నేరాల నియంత్రణకు..

లాడ్జీలు, హోటళ్ల సందర్శకుల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం కోసం ఐటీకోర్‌తో కలిసి విజిటర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేశామన్నారు. రోజువారీ పీటీ కేసుల్లో కోర్టు కేసుల విచారణలను నవీకరించడానికి వెబ్ ఆధారిత అప్లికేషన్ సీఎంఎస్ ద్వారా వేలిముద్రలతో కేసుల స్థితి తెలుసుకునే విధంగా ఐటీకోర్ కృషి చేసిందన్నారు. క్యాంపస్ కాప్స్, చిన్నారికి చేదోడు, విజువల్ పోలీసింగ్ వ్యవస్థ వల్ల శాంతి భద్రతలు అదుపులో పెట్టగలిగామ న్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తరచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు పెడుతూ జరుగుతున్న ప్రమాదాల ప్రదేశాలను గుర్తించి ఆయా చోట్ల సాండ్రామ్స్, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశామన్నారు. దిశ యాప్ గురించి విస్తృత అవగాహన, సైబర్, వైట్‌కలర్ నేరాలపై గ్రామాల్లో మహిళా పోలీసులతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ నేరాలు, మహిళలపై నేరాలు తగ్గాయ న్నారు. కొత్త సంవత్సరంలో కూడా ఇదే విధంగా క్రైమ్‌రేట్ తగ్గిస్తామని ఎస్పీ వెల్లడించారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు విఠలేశ్వరరావు, తిప్పేస్వామి పాల్గొన్నారు.

ఆదిత్యుని సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డి కుటుంబసమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి జిల్లా దేవదాయ శాఖ సూపరింటెండెంట్ బలివాడ ప్రసాద్ పట్నాయక్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మలు సంప్రదాయ పూర్ణకుంభ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆయన వెంట జిల్లా ప్రధాన న్యాయమూర్తి జునైద్ అహ్మద్ మౌలానా, శ్రీకాకుళం ఆర్డీఓ సీహెచ్ రంగయ్య, జిల్లా కోర్టు ప్రొ టోకాల్ సిబ్బంది, ఆలయ సూపరింటెండెంట్ కృష్ణమాచార్యులు, ఎస్‌ఐ బలివాడ గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆయన శ్రీకూర్మం, శ్రీముఖలింగం ఆలయాలను కూడా సందర్శించారు.


జస్టిస్ సురేష్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

తండ్రి అంతిమ రుణం తీర్చుకున్న తనయ



తండ్రి అంతిమ యాత్రలో తనయ మీనా

రాజాం: పట్టణానికి చెందిన ఓ యువతి తనను కనిపెంచి పెద్ద చేసిన తండ్రి అంతిమ సంస్కారాలు పూర్తిచేసింది. ఆ ఇంట్లో మగపిల్లలు లేని లోటును పూడ్చింది. వివరాల్లోకి వెళ్తే.. రాజాం పట్టణ పరిధిలో డోలపేట గ్రామానికి చెందిన కొల్లి లక్ష్మణరావు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఆయనకు నలుగురు ఆడపిల్లలు. వీరిలో మూడవ కుమార్తె మీనా తన తండ్రి అంతిమ సంస్కారాలు పూర్తిచేసింది. ఆమెకు గ్రామస్తులు అండగా నిలిచారు. మీనా బుచ్చింపేట సచివాలయ వార్డు వలంటీర్‌గా పనిచేస్తోంది.

బైక్‌లు ధ్వంసం చేసిన ఏనుగులు



అటవీశాఖ అధికారి బైక్‌ను కాలితో తొక్కుతున్న ఏనుగు

భామిని: మండలంలోని మూలగూడ సమీపంలో ఏనుగులు శుక్రవారం విధ్వంసం సృష్టించాయి. ఏనుగుల జాడ తెలుసుకునేందుకు వెళ్లిన అటవీశాఖ సిబ్బందిపై తిరగబడ్డాయి. వారి ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశాయి. కొత్తూరు ఫారెస్ట్ సెక్షన్ అధికారి లక్ష్మణమూర్తి బైక్‌ను తొక్కిపడేయగా, మరో ట్రాకర్ వాహనం పాక్షికంగా దెబ్బతిన్నది.

ట్రాక్టర్ బోల్తా - యువకుడి మృతి



శ్రీరాములు మృతదేహం

బలిజిపేట: ట్రాక్టర్ బోల్తా పడడంతో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. బలిజిపేట గ్రామానికి చెందిన ఎస్. శ్రీరాములు ట్రాక్టర్ నడుపుతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఈ క్రమంలో వెంగాపురం రెవెన్యూ పరిధి సింగరాయబంద వద్ద నున్న ఇటుక బట్టీ వద్ద ఇటుకుల తయారీకి ట్రాక్టర్‌తో మట్టిని సిద్ధం చేస్తుండగా.. ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ బోల్తా పడింది. దీంతో శ్రీరాములు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తిమృతి



దొంకినవలస రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాలపక్కన పడిఉన్న గుర్తుతెలియని మృతదేహం

బాడంగి: మండలంలోని దొంకినవలస రేల్వే గేట్‌కు సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని బొబ్బిలి రైల్వే పోలీసులు శుక్రవారం గుర్తించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... పూరి నుంచి అహ్మదాబాద్‌వైపు గురువారం వెళ్లే ఎక్స్‌ప్రెస్ నుంచి మృతుడు జారిపడిపోయి ఉండవచ్చని అనుమానిస్తున్నారు. మృతుని వయస్సు 30 ఏళ్లు ఉంటుంది. పట్టాలకు, రైలు చక్రాలకు మధ్య పడిపోవడంతో నడుం సగభాగానికి కట్ అయిపోయింది. స్టేషన్ మాస్టారు ఫిర్యాదు మేరకు ప్రమాద స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం విజయనగరం సర్వజన ఆస్పత్రికి తరలించారు. మృతుని వద్ద ఉన్న ఆధార్‌కార్డు, సెల్‌ఫోన్ దొరికాయని, పశ్చిమబెంగాల్‌కు చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నారు. విజయనగరం రైల్వే ఎస్ఐ వి.రవివర్మ కేసు నమోదుచేశారు. జీన్‌ప్యాంట్, నెక్‌బనియన్ కలిగి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు సెల్: 94906 17089 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్ సందర్శన

విజయనగరం క్రైమ్: వార్షిక తనిఖీల్లో భాగంగా ఎస్పీ ఎం.దీపిక టూటౌన్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులు, సీడీ ఫైల్స్ తనిఖీ చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. దత్తత ఇచ్చిన వార్డుల్లో సమస్యలను సృష్టించే వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ కేసులు, ఎక్సైజ్, గంజాయి కేసులు నమోదుచేయాలని అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీల్లో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, టూటౌన్ సీఐ ఎస్‌హెచ్‌వీ. విజయానంద్, ఎస్ఐలు షేక్ శంకర్, రాజేష్, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన

- చేసిన మంచిని చూసి ఓటేయండి
- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ



వెదుళ్లవలస గ్రామసభలో మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

చీపురుపల్లిరూరల్(గరివిడి): రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధిపాలన సాగుతోందని, చేసిన మంచిని చూసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ కోరారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే దగా మాటలను నమ్మి మోసపోవద్దని హితవుపలికారు. గరివిడి మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో రూ.3.84కోట్ల నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి, చీపురుపల్లి ప్రధాన రోడ్డు నుంచి వెదుళ్లవలస మీదుగా గర్భాం జంక్షన్ వరకు రూ.8.40 కోట్లతో చేపట్టనున్న రోడ్డు నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో అయన మాట్లాడారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో 17 గ్రామాలకు, 700 వ్యవసాయ కనెక్షన్లకు లో ఓల్టేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. వెదుళ్లవలస పంచాయతీలోని లబ్ధిదారులకు నాలుగన్నరేళ్ల కాలంలో వివిధ సంక్షేమ పథకాల కింద రూ.23 కోట్ల ఆర్థిక లబ్ధిని నేరుగా ఖాతాలకు జమచేసినట్టు గుర్తుచేశారు. రూ.2.26 కోట్లతో జల్‌జీవన్ మిషన్ కింద ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నామన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థతో ప్రభుత్వసేవలను ప్రజలకు చేరువచేసినట్టు వెల్లడించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఎందుకు ఇలాంటి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేయలేదో ఒక్కసారి ఆలోచన చేయాలన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలను బాగు చేయాలనే ఆలోచన ఎందుకు రాలేదని ప్రశ్నించాలన్నారు. గత ఎన్నికల సమయంలో డ్వాక్రా రుణమాఫీ అని చెప్పి పసుపు కుంకుమతో సరిపెట్టారని విమర్శించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఏదైనా పథకం రావాలంటే తులమో, ఫలమో ఇవ్వాల్సి వచ్చేదని, ఇప్పుడు పథకాల లబ్ధి నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే చేరుతోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం ప్రజల సంక్షేమం కోసమే ఆలోచిస్తారన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ వైద్యఖర్చు పరిధిని రూ.5లక్షల నుంచి రూ.25లక్షలకు పెంచి పేదకుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు ఇష్టారాజ్యంగా మాట్లాడుతున్నారని, స్థాయిని, వయస్సును చూసి మాట్లాడాలని హితవు పలికారు.

- ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 90 శాతం హామీలను జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేశారన్నారు. ఈ ప్రాంతంలో సబ్‌స్టేషన్ నిర్మాణాలు, తాగునీటి సౌకర్యాలు, రోడ్ల నిర్మాణాలన్నీ ఈ ప్రభుత్వంలో చేసినవేనని తెలిపారు.
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనువాసరావు మాట్లాడుతూ నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి సంక్షేమ కార్యక్రమాలతో పాటుగా ఎన్నో శాశ్వత కార్యక్రమాలు చేశామన్నారు. వంద ఎకరాల అసైన్డ్ భూములకు పట్టాలిచ్చి రైతులను హక్కుదారులను చేసే కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి, బొత్స సత్యనారాయణలకు ఆశీస్సులు అందించాలని కోరారు. సమావేశానికి అగ్రికల్చర్ అసిస్టెంట్ హాజరుకాకపోవడంపై మంత్రి మండిపడ్డారు. వ్యవసాయ రంగానికి సంబంధించిన వివరాలు తెలియజేయాలని సూచించినప్పుడు అందుబాటులో లేకపోతే ఎలా అని వ్యవసాయ అధికారులను ప్రశ్నించారు. ఎందుకు హాజరుకాలేదో వివరణ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జేసీ మయూర్ అశోక్, ఎంపీపీ మీసాల విజయలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు వాకాడ శ్రీనివాసరావు, సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు, వైస్ సర్పంచ్ గుడివాడ శ్రీరాములనాయుడు, వెంకటఅప్పలరాజు, ఏఎంసీ మాజీ చైర్మన్ మీసాల విశ్వేశ్వరరావు, మాజీ ఎంపీపీ కొణిశ కృష్ణంనాయుడు, పలు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.



రూ.8.4 కోట్లతో చేపట్టనున్న బీటీరోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బొత్స సత్యన్నారాయణ



రూ.3.84 కోట్లతో చేపట్టనున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి

ఆడుదాం ఆంధ్రా పోటీల నిర్వహణకు జెడ్పీ నిధులు

విజయనగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా పోటీలకు జెడ్పీ నిధులు సమకూర్చారు. పార్వతీపురం మన్యం జిల్లాకు సంబంధించి క్రీడల నిర్వహణకు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు లక్ష రూపాయలను గురువారం తన కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో పార్వతీపురం ఎమ్మెల్యే అలజంగి జోగారావు, జెడ్పీ వైస్ చైర్మన్ బాపూజీనాయుడు, జెడ్పీ సీఈఓ రాజ్‌కుమార్, పార్వతీపురం మన్యం జిల్లా క్రీడాప్రాధికార సంస్థ అధికారి ఎస్.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



రూ. లక్ష చెక్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

హ్యాకథాన్‌లో లెండి విద్యార్థుల ప్రతిభ

డెంకాడ: స్మార్ట్ ఇండియా హ్యాకథాన్–2023లో లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దుర్గ్‌లోని బిలాయ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఇటీవల నిర్వహించిన స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ పోటీల్లో లెండి ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు మొదటి స్థానంలో నిలిచి రూ. లక్ష నగదు బహుమతి సాధించారు. పి.ధన్యశ్ర నేతృత్వంలోని విద్యార్థులు వి.సాయికృష్ణ, ఎస్.శాంతికుమారి, పి.నరసింహ, ఎస్.శ్రీను, పి.వివేక్‌లతో కూడిన బృందం ప్రతిభ చాటింది. మెంటార్ ఎస్.సురేష్‌కుమార్, ఈసీఈ విభాగాధిపతి ఎం.రాజన్‌బాబు, సీఎస్ఎస్ఈ విభాగాధిపతి ఆర్.రాజేందర్ ప్రోత్సాహంతో రాణించిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వీవీ రామారెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ తమ్మినేని హరిబాబు, అధ్యాపకులు, తదితరులు అభినందించారు.



నిర్వాహకుల నుంచి చెక్కు అందుకుంటున్న లెండి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు

దక్షిణ భారత స్థాయి సైన్స్ పోటీలకు జిల్లా ప్రాజెక్ట్



రాష్ట్రస్థాయి పోటీలలో విజేతగా జ్ఞాపిక అందుకుంటున్న విద్యార్థిని ఐ.హాసిని, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రామకృష్ణ

విజయనగరం అర్బన్: విజయవాడలో వచ్చే నెల 27, 28, 29వ తేదీల్లో జరగనున్న దక్షిణ భాతర స్థాయి సైన్స్‌ఫేర్ పోటీలకు రాజాం మండలం డోలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని ఐ.హాసిని రూపొందించిన 'స్మార్ట్ ట్రాలీ' వైజ్ఞానికప్రాజెక్ట్ ఎంపికైంది. కడపలో శుక్రవారం జరిగిన రాష్ట్రస్థాయి పోటీలలో జిల్లా నుంచి ప్రదర్శించిన తొమ్మిది ప్రాజెక్టులలో స్మార్ట్ ట్రాలీ ప్రాజెక్ట్ ఎంపికైందని జిల్లా సైన్స్ కో ఆర్డినేటర్ మిరియాల రామకృష్ణ తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయురాలు శ్రీదేవి పర్యవేక్షణలో ప్రాజెక్ట్ రూపొందించిన విద్యార్థినికి డీఈఓ బి. లింగేశ్వర రెడ్డి, డిప్యూటీ ఈఓలు బ్రహ్మాజీరావు, వాసుదేవ రావు అభినందించారు.

జాతీయస్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో నీరజ ప్రతిభ

నెల్లిమర్ల రూరల్: అరుణాచల్‌ప్రదేశ్‌లోని రాజీవ్ గాంధీ యూనివర్సిటీలో ఈ నెల 28 నుంచి అ జరుగుతున్న ఐడబ్ల్యూఎల్ఎఫ్ జాతీయ స్థాయి యూత్ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో మండలంలోని కొండవెలగాడ గ్రామానికి చెందిన క్రీడాకారిణి బాలి నీరజ కాంస్య పతకం సాధించింది. శుక్రవారం జరిగిన 40 కిలోల విభాగం పోటీలో నీరజ స్నాచ్‌లో 53 కిలోలు, క్లీన్ అండ్ జెర్క్‌లో 60 కిలోలు...మొత్తంగా 113 కిలోల బరువు ఎత్తి కాంస్య పతకం దక్కించుకుంది. ప్రతిభ కనబరిచిన నీరజకు జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రతినిధులు లక్ష్మి, వెంకటరామయ్య, చల్లా రాము, తదితరులు అభినందనలు తెలిపారు.



కాంస్య పతకాన్ని చూపిస్తున్న క్రీడాకారిణి నీరజ

దీపకాంతుల శోభలో సీతారామచంద్రస్వామి



దీపాల కాంతుల శోభలో స్వామికి ఊంజల్ సేవ జరిపిస్తున్న అర్చకులు

నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శుక్రవారం కనుల పండువగా నిర్వహించారు. వెండి మంటపంలో ఉన్న సీతారామస్వామి ఉత్సవ విగ్రహాలను మంగళవాయిధ్యాలు, వేద మంత్రోచ్చారణల నడుమ ఊరేగింపుగా తీసుకువచ్చి, దీపారాధన మంటపంలో ఉన్న ప్రత్యేక ఊయలలో వేంచేయించారు. అనంతరం దీపాలను వెలిగించి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి భక్తి శ్రద్ధలతో దీపాలను వెలిగించి స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో అర్చకులు కిరణ్‌కుమారాచార్యులు, రామగోపాల్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయండి



డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

విజయనగరం అర్బన్: నగరంలోని జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ఏపీయూడబ్ల్యూజే జిల్లా కమిటీ అభ్యర్థించింది. ఈ మేరకు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి వీఎస్ఎస్‌వీ ప్రసాద్ ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు కోలగట్లను శుక్రవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ, అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయిస్తానని తెలిపారు. ఆయన్ని కలిసిన వారిలో ఏపీయూడబ్ల్యూజే నాయకులు పంచాది అప్పారావు, జె.శేషగిరి, సముద్రాల నాగరాజు, రవి, డేవిడ్ రాజు, తదితరులున్నారు.

'పీఎం జన్ మాన్'తో అర్హులకు మరిన్ని పథకాలు

- కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ ప్రతినిధి బిస్మితాదాస్



పార్వతీపురం టౌన్: అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో విష్ణుచరణ్

సీతంపేట: పీఎం జన్ మాన్ పథకం కింద పీవీటీజీ గిరిజనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా మరిన్ని ప్రత్యేక పథకాలు అందించనున్నట్లు కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ ప్రతినిధి బిస్మితాదాస్ తెలిపారు. శుక్రవారం మండలంలోని అక్కన్నగూడ గ్రామాన్ని ఐటీడీఏ పీవో కల్పనాకుమారితో కలిసి సందర్శించిన ఆమె జన్ మాన్ పథకం కింద అందిస్తున్న 11 రకాల పథకాలను వివరించారు. పథకాల మంజూరుకు లబ్ధిదారుల కోసం సర్వే జరుగుతోందని, ఈ సర్వేను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా ఇప్పటివరకు గృహాలు లేని వారికి, పూరిళ్లలో నివసిస్తున్న వారికి ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. వీటితో పాటు మరిన్ని పథకాలు వర్తింపజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ డీడీ మంగవేణి, తదితరులు పాల్గొన్నారు.

త్వరగా సర్వే పూర్తి చేయండి..

పార్వతీపురంటౌన్: పీఎం జన్ మాన్ సర్వేను త్వరితగతిన పూర్తి చేయండి అని పార్వతీపురం ఐటీడీఏ పీవో సి.విష్ణుచరణ్ ఆదేశించారు. స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో గృహ నిర్మాణ సంస్థ అధికారులతో శుక్రవారం సమావేశమైన ఆయన గిరిజనుల గృహ నిర్మాణాలపై సమీక్షించారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, మక్కువ, సాలూరు, పాచిపెంట, గరుగుబిల్లి, బలిజిపేట మండలాల్లోని ఆదివాసీ గిరిజనుల(పీవీటీజీ)ను పూర్తిస్థాయిలో సర్వే చేసి, అర్హులై, గృహాలు లేని వారి జాబితాను తయారు చేయాలని సూచించారు. జన్ మాన్ కార్యక్రమం కింద అర్హులందరికీ గృహాలు మంజూరవుతాయన్నారు. సమావేశంలో గృహ నిర్మాణ సంస్థ డీఈలు ప్రసాద్, సోమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భామిని: మండలంలోని నల్లరాయిగూడలో కేంద్ర గిరిజన మంత్రిత్వ వ్యవహారాల శాఖ ప్రతినిధి బిస్మితాదాస్.. ఐటీడీఏ పీవో కల్పనాకుమారితో కలిసి శుక్రవారం పర్యటించి, అక్కడి వారికి పీఎం జన్ మాన్ పథకం కింద ఆదివాసీ గిరిజనులకు అందిస్తున్న 11 రకాల పథకాలపై అవగాహన కల్పించారు. అర్హులైన వారంతా సర్వే సిబ్బందికి పేర్లు ఇవ్వాలని తెలిపారు.



సీతంపేట: గిరిజనులతో కలిసి పథకాల బుక్‌లు చూపిస్తున్న కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ప్రతినిధి బిస్మితాదాస్

సార్వత్రిక ఎన్నికలపై ప్రత్యేక శ్రద్ధ

- సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాల గుర్తింపు
- ఎస్పీ విక్రాంత్ పాటిల్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

పార్వతీపురంటౌన్: సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడడంపై దృష్టిసారించామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన డిసెంబర్ నెల నేర సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలు కొద్దినెలల్లో జరిగే అవకాశం ఉన్నందున ప్రతిఒక్కరూ అతి జాగ్రత్తతో విధులు నిర్వహించాలన్నారు. ఏ చిన్న పొరపాటు జరిగినా అవి సంచలనంగా మారే అవకాశం ఎక్కువన్నారు. ఇప్పటినుంచే ఎన్నికలకు సిద్ధం కావాలని ఆదేశించారు. సమస్యాత్మక, అతి సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. అనంతరం విధి నిర్వహణలో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేశారు. పోలీస్ అమర వీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, పోలీస్ సిబ్బందికి నగదు బహుమతి, ప్రశంసాపత్రాలను అందజేశారు.కార్యక్రమంలో ఏఎస్పీ డాక్టర్ ఒ.దిలీప్ కిరణ్, ఏఎస్పీ సునీల్ షారోన్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హర్షిత, పాలకొండ సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి జీవీ కృష్ణారావు, ఎస్సీ, ఎస్టీసెల్ డీఎస్పీ జి.మురళీధర్, డీసీఆర్‌బీ సీఐ ఎన్‌వీ ప్రభాకరరావు, జిల్లా సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఎస్పీ

లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు



జామి: ధనుర్మాస ఉత్సావాల్లో భాగంగా మండలంలోని కుమరాం ఐశ్వర్య లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం విశిష్ట పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వరప్రసాద్ ఆచార్యులు ఆధ్వర్యంలో స్వామివారిని విశేష అలంకరణతో ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- ఏడీఏ నాగభూషణం



కనకదుర్గ రైస్ మిల్లు వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నాగభూషణం

గంట్యాడ: రైతులు మిల్లులకు తీసుకొచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేయాలని, రైతులను ఇబ్బంది పెట్టొద్దని ఏడీఏ నాగభూషణం మిల్లర్లను ఆదేశించారు. మండలంలోని కొఠారుబిల్లి జంక్షన్ వద్ద ఉన్న కనకదుర్గ రైస్ మిల్లును శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. తూకం, తేమశాతం కొలిచే పరికరాలను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు రైతుల నుంచి ధాన్యం సేకరిచాలని సూచించారు. ఒక్క గింజ ఎక్కువగా తీసుకున్నా సంబంధిత మిల్లుపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం రావివలస రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించిన ట్రక్ షీట్, ఎఫ్‌టీఓలో సమస్యలు ఏవైనా ఉన్నాయా అని రైతులను అడిగితెలుసుకున్నారు. అక్కడ నుంచి లక్కిడాం జంక్షన్‌లో ఉన్న వేంకటేశ్వర ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగు మందుల నిల్వలను పరిశీలించారు. ఎంఆర్పీ కంటే అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్, ఏఈఓ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

నేరాల సంఖ్య తగ్గుముఖం



సమర్థవంతంగా విధులు నిర్వహించిన మహిళా అధికారిణికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎస్పీ

విజయనగరం క్రైమ్: పోలీసుల సమష్టి కృషి ఫలితంగా గతేడాది కంటే ఈ ఏడాది నేరాల సంఖ్య తగ్గిందని ఎస్పీ ఎం.దీపిక అన్నారు. ముందస్తు సమాచారం, సమన్వయంతో పేకాట, కోడి పందాలు, బెల్ట్ షాపులు, గంజాయి, మద్యం, సారా అక్రమరవాణాను నియంత్రించగలిగామన్నారు. ఇదే స్ఫూర్తితో పనిచేసి శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేయాలని కోరారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులను క్షేత్రస్థాయిలో గుర్తించాలన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా పోలీస్ అధికారులతో శుక్రవారం నిర్వహించిన వార్షిక నేర సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. తుపాకుల లైసెన్స్‌లను క్షేత్రస్థాయిలో పరిశీలించి రెవెన్యూ రికార్డులతో సరిపోల్చాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు సృష్టించే వ్యక్తులను గుర్తించి, మంచి ప్రవర్తనకు బైండోవర్ చేయాలన్నారు. గ్రామస్థాయి సమాచారం దత్తత పోలీసులు స్టేషన్‌కు చేరేలా చర్యలు తీసుకోవాలన్నారు. గంజాయి, సారా అక్రమరవాణాకు పాల్పడే వ్యక్తులను గుర్తించి, పీడీయాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ చేయడం, నేరాల నియంత్రణ, కేసుల విచారణలో ప్రతిభ చూపిన అధికారులు, సిబ్బందిని అభినందించారు. ప్రశంసాపత్రాలతో పాటు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. నేర సమీక్ష సమావేశంలో సెబ్ అదనపు ఎస్పీ ఎస్.వెంకటరావు, విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీధర్, చీపురుపల్లి డీఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి, దిశ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, డీటీసీ డీఎస్పీ వీరకుమార్, ఏఆర్ డీఎస్పీ యానివర్స్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.